

### గ్యారెంటీల్లేని వ(భ)ట్టి బడ్జెట్: వేములు

అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆరు గ్యారెంటీల్లేని వట్టి బడ్జెట్ అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దెప్పిపొడిచారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో వెలుగిన తెలంగాణ.. కాంగ్రెస్ 15 నెలల పాలనలో అంధకారంలోకి వెళ్లిందని విమర్శించారు. యువ వికాసం పేరిట అధికార పార్టీ కార్యకర్తలకు దోచిపెట్టే కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ రైతులు, రైతుకూలీలు, మహిళలు, వృద్ధులు, బీసీలు, మైనార్టీలను మోసం చేసిందని నిప్పులు చెరిగారు.




## 7,704cr

బడ్జెట్‌లో ఐటీశాఖకు ప్రతిపాదించిన నిధులివి



# బంగారు బాట వదిలి.. కాటగలిసి!

**బీఆర్ఎస్ పదేండ్లపాలనలో తలసరి, జీఎస్డీపీ భళా • 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కసారిగా డీలా • సోషియో ఎకనామిక్ సర్వేలో వెల్లడి**

2024-25లో తలసరి ఆదాయం రూ. 3,79,751

కేసీఆర్ తలసిరులతో పోలిస్తే 5.74 శాతం తక్కువ

జీఎస్డీపీ వృద్ధిలోనూ మునుపటి దూకుడు గాయబ్

వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు గడ్డుకాలం

ఆయా రంగాల్లో శ్రామికశక్తి వాటా తగ్గడమే రుజువు

సామాజిక, ఆర్థిక నివేదిక 2025లో సంచలన విషయాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సమ్మిళితాభివృద్ధే ధ్యేయంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లపాటు శ్రమించి రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదులు వేశారు. పసికూనగా ఉన్న రాష్ట్రాన్ని అన్ని విషయాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం వేసిన ఆ బాటలో నడవడం కూడా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక (సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్)-2025 దీన్నే తేటతెల్లం చేస్తున్నది.

### పదేండ్ల ప్రగతిని దాచాలని..

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాగు విస్తీర్ణం కూడా ఎంతో పెరిగింది. ధాన్యం దిగుబడి కొత్త రికార్డులను నమోదు చేసింది. అంతేకాదు.. విద్యుత్తు సంస్థల బలోపేతం, స్థాపిత విద్యుత్తు సామర్థ్యంలో పెరుగుదల, విద్య-వైద్య రంగాల అభివృద్ధి, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, వైద్య కళాశాలల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అన్నివర్గాల అభ్యున్నతికి 400కు పైగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఇలా చెప్పుకొంటూ పోతే ఆ జాబితా ఎంతో పెద్దది. అయితే, తాజా ఆర్థిక సర్వేలో ఆ అంశాలను, లెక్కలను కేవలం ఒక్క ఏడాదికే పరిమితం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అదేదో తమ ఘనతగా చెప్పుకొనే ప్రయత్నం చేసింది. గతంలో జరిగిన ప్రగతిని విస్మరించి.. తాము 15 నెలల కాలంలో చేపట్టిన, ఇకపై చేపట్టబోయే పనుల గురించి మాత్రమే ఏకరువు పెట్టింది. అంతే కాదు నిజాలను కూడా దాచిపెట్టింది. ఉదాహరణకు.. కేసీఆర్‌హయాంలో ప్రారంభించిన హరితహారం పథకం వల్లే రాష్ట్రంలో గ్రీన్ కవరేజీ జాతీయ సగటు కంటే ఎంతో ఎక్కువగా పెరిగింది. అయితే, ఆర్థిక సర్వేలో అటవీ విస్తీర్ణం ఎంత ఉందన్న విషయాన్ని మాత్రమే పేర్కొన్న రేవంత్ ప్రభుత్వం.. దానికి కారణమైన 'హరితహారం' పథకాన్ని నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదు. ఇదొక్క విషయమే కాదు.. దాదాపు ప్రతీ రంగంలో పదేండ్లలో తెలంగాణ సాగించిన ప్రగతిని విస్మరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆర్థిక సర్వేలో అడుగడుగునా ఈ విషయం తేటతెల్లమైంది.

### తెలంగాణ స్వరూపం

- విస్తీర్ణం: 1,12,077 చదరపు కిలోమీటర్లు
- జనాభా: 3.5 కోట్లు (2011 గణాంకాల ప్రకారం)
- జిల్లాలు: 33
- మండలాలు: 621
- గ్రామ పంచాయతీలు: 12,941



### తలసిరిలో తగ్గిన దూకుడు!

ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు అక్కడి పౌరుల తలసరి ఆదాయాన్ని, ఉత్పాదకతను (జీఎస్డీపీ)ని ప్రామాణికంగా తీసుకొంటారు. కేసీఆర్ ప్రభుత్వహయాంలో గడిచిన పదేండ్లలో తెలంగాణ ఈ రెండు అంశాల్లో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఒక్క తలసరి, జీఎస్డీపీలోనే కాదు.. సాగు, పారిశ్రామికీకరణ, సేవలు, సంక్షేమం.. ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించింది.

**అయితే,** ఆ ఒరవడిని కొనసాగించడంలో రేవంత్ ప్రభుత్వం చతికిలపడినట్టు ఆర్థిక సర్వేలోని గణాంకాలను బట్టి తెలుస్తున్నది. రాష్ట్రంలో సగటున ఒక్కో పౌరుడు సంపాదించే మొత్తాన్ని తలసరి ఆదాయంగా పిలుస్తారు. తలసరి ఆదాయంలో వృద్ధిరేటును ఒక దేశం లేదా రాష్ట్ర అభివృద్ధి వేగానికి నిదర్శనంగా భావించొచ్చు. ఈ రెండు అంశాల్లో జాతీయ తలసరి ఆదాయంతో పోల్చితే.. తెలంగాణ గతంలో ఎంతో ఎత్తులో ఉండేది. కేసీఆర్‌హయాంలో గడిచిన పదేండ్లలో చేపట్టిన సంస్కరణలే దీనికి కారణంగా చెప్పొచ్చు. అయితే, తలసరి ఆదాయం విషయంలో కేసీఆర్ హయాంలో నమోదైన రికార్డులు.. రేవంత్ 15 నెలల పాలనలో తగ్గుముఖం పట్టాయనే చెప్పొచ్చు. కేసీఆర్ పదేండ్లపాలనలో తలసరి ఆదాయంలో సగటున వృద్ధిరేటు 15.34 శాతంగా నమోదైతే, కాంగ్రెస్ పాలనలో ఇది కేవలం 9.6 శాతానికే పరిమితమైంది. కాగా దేశ తలసరి ఆదాయం కంటే, రాష్ట్రంలోని దాదాపు 30 జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉండటం గమనార్హం. కేసీఆర్‌వేసిన ఆర్థిక పునాదులే దీనికి కారణంగా ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.






### తలసరి డీలా

బీఆర్ఎస్‌హయాంలో గడిచిన పదేండ్లలో కేసీఆర్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో తెలంగాణ పౌరుల తలసరి ఆదాయం రాకెట్ వేగంతో దూసుకుపోయింది. జాతీయ తలసరి కంటే రెట్టింపుగా ఉండేది. అయితే ఆ వేగానికి రేవంత్ ప్రభుత్వం బ్రేకులు వేసినట్టు ఆర్థిక సర్వే గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. కేసీఆర్ పదేండ్ల పాలనలో తలసరి ఆదాయంలో సగటున వృద్ధిరేటు 15.34 శాతంగా నమోదైతే, కాంగ్రెస్ పాలనలో ఇది కేవలం 9.6 శాతానికే పరిమితమైంది.

**తలసరి ఆదాయం ఇలా.. (రూపాయల్లో)**

| సంవత్సరం | తలసరి ఆదాయం |
|---|---|
| 2014-15 | 1,24,104 |
| 2022-23 | 3,12,398 |
| 2024-25 | 3,79,751 |

కేసీఆర్ పాలనలో తలసరి ఆదాయంలో వృద్ధిరేటులో సగటు **15.34%**

రేవంత్ ఏడాది పాలనలో తలసరి ఆదాయంలో నమోదైన వృద్ధిరేటు **9.6%**

రేవంత్‌పాలనలో తగ్గుదల **5.74%** ↓



### జీఎస్డీపీలో వృద్ధిరేటు పతనం

ఒక రాష్ట్రంలోని మొత్తం పౌరుల ఉత్పాదకతను స్థూలంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ)గా పిలుస్తారు. తెలంగాణ ఆవిర్భావం జరిగినప్పుడు 2014-15లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. అయితే, 2022-23నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 13.13 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 8 లక్షల కోట్ల మేర పెరిగింది. ఇప్పుడు అది రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది.

**అయితే** కేసీఆర్‌పాలనతో పోలిస్తే, జీఎస్డీపీ వృద్ధిరేటు రేవంత్ పాలనలో 1.8 శాతం మేర తక్కువగా నమోదైనట్టు ఆర్థిక సర్వే గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. జీఎస్డీపీలో వ్యవసాయ రంగం వాటా నిరుడు 18 శాతంగా ఉంటే ఈ ఏడాది 17.3 శాతానికి పడిపోయింది. పరిశ్రమలు, మైనింగ్, తయారీ రంగం వాటా నిరుడు 16.8 శాతంగా ఉండగా ఇప్పుడు 16.4 శాతానికి పరిమితమైంది. రేవంత్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఉత్పాదకతను దెబ్బతీసినట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### నాటి జీఎస్డీపీ దూకుడు ఏది?

2014-15లో తెలంగాణ జీఎస్డీపీ రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. 2022-23నాటికి ఇది రూ. 13.13 లక్షల కోట్లకు చేరింది. అయితే, కాంగ్రెస్‌పాలనలో జీఎస్డీపీ వృద్ధిరేటు కుంటుపడింది. కేసీఆర్‌పాలనలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిరేటు కంటే తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిరేటు 2.8 శాతం ఎక్కువగా ఉంటే, ఇప్పుడు రేవంత్‌పాలనలో నమోదైన జీఎస్డీపీ వృద్ధిరేటు దేశ జీడీపీ వృద్ధిరేటు కంటే 0.2 శాతం మాత్రమే ఎక్కువగా ఉన్నది. అంటే కేసీఆర్‌పాలనలో పోల్చిచూస్తే, ఇది 2.6 శాతం తక్కువ.

**తెలంగాణ జీఎస్డీపీ (ప్రస్తుత ధరల్లో)**

| సంవత్సరం | జీఎస్డీపీ |
|---|---|
| 2014-15 | 5.05 లక్షల కోట్లు |
| 2022-23 | 13.13 లక్షల కోట్లు |
| 2024-25 | 16.12 లక్షల కోట్లు |

2022-23 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీ వృద్ధిరేటు **11.9%**

2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీ వృద్ధిరేటు **10.1%**

రేవంత్‌పాలనలో తగ్గుదల **1.8%** ↓

**జీఎస్డీపీలో దేని వాటా ఎంత?**

| రంగం | వాటా |
|---|---|
| వ్యవసాయం, అనుబంధ రంగాలు | 17.3% |
| పరిశ్రమలు, మైనింగ్, తయారీ రంగం | 16.4% |
| సేవా రంగం | 66.3% |

### సాగును వదిలి.. రైతు కదిలి..

కేసీఆర్ పదేండ్లపాలనలో సాగు, దాని అనుబంధరంగాల్లో గణనీయమైన ప్రగతి జరిగింది. రైతులకు ఎవుసం ఒక పండుగగా మారింది. అందుకే 2023లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి దాదాపు 47.34 శాతం మంది ఉపాధి పొందేవారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. అయితే రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సాగును వదిలిపెట్టిన వారి సంఖ్య ఏకంగా 4.64 శాతంగా నమోదైంది. సాగునీటికి గోస, ఎరువుల కొరత, రుణమాఫీ కాకపోవడం, రైతు భరోసాలో జాప్యం జరుగడమే వ్యవసాయరంగాన్ని రైతులు వీడటానికి కారణంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



2023లో కేసీఆర్‌హయాంలో వ్యవసాయంపై ఆధారపడినవారు **47.34%**

2024-25లో సాగు, దాని అనుబంధరంగాలపై ఆధారపడినవారు **42.7%**

తగ్గుదల **4.64%**

**2024-25లో వ్యవసాయం, దాని అనుబంధరంగాల్లో వృద్ధిరేటు**

జాతీయస్థాయి వృద్ధిరేటు - **10.1%**

తెలంగాణలో వృద్ధిరేటు - **5.5%**

**జీఎస్డీపీలో వ్యవసాయరంగం వాటా ఇలా..**

| 2023-24 | 2024-25 |
|---|---|
| 18% | 17.3% |



### పరిశ్రమ వాటాలోనూ కోత!

**జీఎస్డీపీలో** పరిశ్రమలు, మైనింగ్, తయారీ రంగం వాటా నిరుడు 16.8 శాతంగా ఉండగా ఇప్పుడు 16.4 శాతానికి పరిమితమైంది. దీన్నిబట్టి రేవంత్ పాలనలో పారిశ్రామికరంగం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న విషయం అర్థమవుతున్నది. ఇప్పటికే విపణిలో ఉద్యోగ సంక్షోభం నెలకొనగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే కేన్స్, కార్నింగ్, ప్రీమియర్ ఎనర్జీస్ వంటి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం తెలిసిందే.

**జీఎస్డీపీలో పారిశ్రామికరంగం వాటా తగ్గుదల ఇలా..**

2023-24: **16.8%**

2024-25: **16.4%**



### హరితహారంతోనే పచ్చని తెలంగాణ

**కేసీఆర్** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన హరితహారం కార్యక్రమంతో తెలంగాణ ఆకుపచ్చని తోరణంగా మారింది. రాష్ట్రంలో 27,688 చదరపు కిలోమీటర్ల మేర అటవీ విస్తీర్ణం పర్చుకొన్నదని ఆర్థిక సర్వే నివేదిక తెలిపింది. జాతీయ సగటు 23.59 శాతంతో పోలిస్తే, తెలంగాణలో అటవీ విస్తీర్ణం 24.69 శాతంగా (1.1 శాతం ఎక్కువ) ఉన్నట్టు వెల్లడించింది. అయితే రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో హరితహారం పథకం దాదాపు మూలనపడింది. తాగేందుకే నీళ్ల లేని పరిస్థితిలో ఇక హరితహారం మొక్కలు, చెట్లను పట్టించుకునే వారే లేకుండాపోయారు. దీంతో పచ్చని మొక్కలు కాస్త ఎండిపోతున్నాయి.

తెలంగాణ అటవీ విస్తీర్ణం **27,688** చదరపు కిలోమీటర్లు

మొత్తం విస్తీర్ణంలో అటవీ ప్రాంతం **24.69%**




బీఆర్ఎస్ హయాంలో నాగర్‌కర్నూల్‌లో హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగిన దృశ్యం




ప్రస్తుతం అదే ప్రాంతంలో చెట్లన్నీ ఎండిపోవడంతో చదును చేసిన దృశ్యం

### లోటు కాదు.. ఎప్పుడూ మిగులు బడ్జెట్టే

**రాష్ట్రం దివాలా తీసిందనడం ఒట్టి బూటకమే**

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎప్పుడూ మిగులు బడ్జెట్ రాష్ట్రమేని తాజాగా మరోసారి స్పష్టమైంది. రాష్ట్ర ఆదాయం ఎప్పుడూ మైనస్‌లోకి వెళ్లలేదని తాజా బడ్జెట్ గణాంకాలు తేల్చాయి. 2023-24 బడ్జెట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.297.42 కోట్ల మిగులును ప్రతిపాదించింది. అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కారు కూడా 2024-25 బడ్జెట్‌లో రూ.5,888.71 కోట్ల మిగులును ప్రకటించింది. బుధవారం ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో మిగులు రూ.2,738.33 కోట్లకు పరిమితమైనప్పటికీ తెలంగాణ ఎప్పుడూ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని రుజువైంది. సీఎం రేవంత్ ఆరోపిస్తున్నట్టు రాష్ట్ర బడ్జెట్ ఎప్పుడూ మైనస్‌లోకి వెళ్లలేదని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## యువవికాసం.. 'కాంగ్రెస్'కే ఫలహారం!

**బడ్జెట్‌లో పథకానికి రూ.6 వేల కోట్లు**

**కార్యకర్తలకే లబ్ధి అంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పిన పథకాలకు సర్కారు అరకొర నిధులే కేటాయించింది. కొన్నింటి ఊసే ఎత్తలేదు. రాజీవ్ వికాసం పథకానికి మాత్రం చెప్పిన విధంగానే రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించింది. అయితే ఈ పథకం కింద కార్యకర్తలకే లబ్ధి చేకూర్చాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించడం గమనార్హం. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా రూ.6 వేల కోట్లను సబ్సిడీ రుణాలుగా అందించనున్నది. చెప్పినట్టుగానే అందుకోసం ప్రస్తుత బడ్జెట్‌లో సమృద్ధిగా నిధులను సమకూర్చింది. ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.2,000 కోట్లు, ఎస్టీ కార్పొరేషన్ కింద రూ.1,360 కోట్లు, బీసీ కార్పొరేషన్ కింద రూ.1,800 కోట్లు, మైనార్టీ కార్పొరేషన్ కింద రూ.840 కోట్లను మొత్తంగా రూ.6,000 కోట్లను పొందుపరిచింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. జూన్ 2లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాన్ని వర్తింపజేయనున్నారు. కాగా, ఈ పథకం ప్రారంభం సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'గత ఎన్నికల్లో పార్టీ కోసం రాత్రిబవళ్లు కష్టపడి, చదువుకుని ఖాళీగా ఉంటున్న కాంగ్రెస్ కార్యకర్తల కోసం రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నా. ఈ నిధులను కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలకు అంకితమిస్తూ ఉపయోగిస్తాం. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాజకీయ వ్యూహాలు మాత్రమే కాదు, తమ జీవనోపాధి కోసం కూడా పనిచేస్తున్నారు. పార్టీ కార్యకర్తలకు మాత్రమే కాదు, వారి కుటుంబాలకు కూడా ఆర్థిక భద్రత ఇవ్వడం మా ప్రాధాన్యం. వెంట తిరిగిన కార్యకర్తలకు ఏదైనా చేయాలని అన్ని నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు కూడా నన్ను కోరారు. అందుకే కార్యకర్తలకు స్వయం ఉపాధి పథకం కింద రూ.4 లక్షల వరకు అందిస్తాం. రెండు నెలల్లో ఈ డబ్బులు పంపిణీ చేస్తాం. ప్రతీ నియోజకవర్గంలో 4,000 నుంచి 5,000 మందికి డబ్బులు వస్తాయి. అర్హులైన కార్యకర్తలకు అందించే బాధ్యత ఎమ్మెల్యేలదే' అంటూ వెల్లడించారు.


### హోంగార్డులపై సర్కార్ చిన్నచూపు

**పెంచింది రూ.79.. పబ్లిసిటీ రూ.1,000**

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): హోంగార్డులపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్యం చూపింది. వారికి మాజీ సీఎం కేసీఆర్ రోజుకు రూ.921 వేతనం ఇస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.79 పెంచి మొత్తం రూ.1,000ని తామే పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నది. సహజ మరణమైనా, ప్రమాదవశాత్తు మరణించినా హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని గత జనవరిలో జీవో ఇచ్చినా.. ఒక్కరికీ ఇవ్వలేదు. జీవో ప్రకారం 2016 నుంచి చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, ఈ ఏడాది జనవరి నుంచి ఇస్తామని చెప్పింది. రెండున్నర నెలల్లో సుమారు 10 మంది చనిపోయినా ఏ ఒక్క కుటుంబానికీ రూపాయి ఇవ్వలేదు.బడ్జెట్‌లో హోంగార్డులకు అన్యాయం చేసిందని ఆ కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి.

## బడి గంట కొట్టేదెప్పుడు!

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఎప్పుడు పూర్తయ్యేను!
- బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు
- తొలిదశలో 58 భవనాలకు సర్కార్ అనుమతి
- నిర్మాణాలకు కావాల్సింది రూ.11,600 కోట్లు
- మొత్తం 119 భవనాలకు రూ.23,200 కోట్లు
- ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది 2,900 కోట్లే



హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలకూ బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కలేదు. అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తామని సర్కారు చెప్పిన మాటలన్నీ వట్టివేనని ఈ బడ్జెట్ కేటాయింపులే తేల్చిచెప్పాయి. భవనాల నిర్మాణాలకు అరకొర నిధులు కేటాయించి సర్కారు మొండిచేయి చూపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలన్నీ కలిపి ఒకే సముదాయంలో ఏర్పాటు చేస్తామని చెప్పడమేగాక, నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ స్కూళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. తొలుత వికారాబాద్ జిల్లా కొడంగల్, ఖమ్మం జిల్లా మధిర, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో గురుకుల భవన నిర్మాణాలకు ఆడంబరంగా శంకుస్థాపనలు చేసింది. ఇటీవలే మరో 55 నియోజకవర్గాలకు స్కూల్ భవనాలను మంజూరు చేసింది. ఒక్కో గురుకుల భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.200 కోట్లు అవసరమని అంచనా వేసి, మొత్తంగా తొలిదశలో 58 గురుకుల భవనాలకు రూ.11,600 కోట్లతో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. మిగతా 58 నియోజకవర్గాలకు మరో రూ.11,600 కోట్లు.. మొత్తంగా119 నియోజకవర్గాల్లో గురుకుల భవనాలను నిర్మించాలంటే రూ.23,200 కోట్లు అవసరం. తొలిదశలో మంజూరు చేసిన 58 గురుకులాలు నిర్ణీత సమయంలో పూర్తికావాలంటే ప్రతి బడ్జెట్‌లో దాదాపు రూ.6,000 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. తీరా బడ్జెట్ చూస్తే అందులో సగం కూడా కేటాయించకపోవడం గమనార్హం. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో మొత్తంగా రూ.2,900 కోట్లను మాత్రమే నామమాత్రంగా కేటాయించింది. ఈ లెక్కన క్రమం తప్పకుండా బడ్జెట్ కేటాయించినా తొలిదశలోని 58 భవనాల నిర్మాణాలకే నాలుగేండ్లు పట్టే అవకాశం ఉండగా, మిగతా 58 భవనాల నిర్మాణాలను ఎప్పుడు పూర్తిచేస్తారో!